# దక్షిణాదికి తీరని అన్యాయం!

- జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌తో నష్టమే
- నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు భారీగా తగ్గనున్న ప్రాతినిధ్యం
- మరింత పెరగనున్న ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం
- ఎక్కువగా లాభపడేది బీజేపీ లాంటి పార్టీలే
- దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా 33%
- పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం మాత్రం 20 శాతమే
- డీలిమిటేషన్‌కు జనాభా ప్రాతిపదిక వద్దు: కేటీఆర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): 'నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాలపై కత్తి వేలాడుతున్నది' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మద్దతు ప్రకటించారు. జనాభా నియం త్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దీనిపై తాజాగా కోయంబత్తూరులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2026లో చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు కూడా కొత్తగా లోక్‌సభ స్థానాలు దక్కుతాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల ఎవరికి లాభం చేకూరనున్నది? ఏ రాష్ట్రాలకు నష్టం కలుగనున్నదన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది.

**పొంచి ఉన్న నష్టం**

అమిత్ షా తాజా వ్యాఖ్యలను బట్టి 2026లోనే 'జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన విధానం' (డీలిమిటేషన్) ప్రక్రియ ఉండనున్నది. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగనున్నట్టు మేధావులు చెప్తున్నారు. జనాభా నియంత్రణలో గత కొన్నేండ్లుగా క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇప్పుడు ఆ క్రమశిక్షణే పెద్ద 'రాజకీయ శిక్ష'గా మారనున్నట్టు పేర్కొంటు న్నారు. జనాభా నియంత్రణ అమలును గాలికొది లేసిన ఉత్తరాది రాష్ట్రాలు.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆధిపత్యం చెలాయించ నున్నట్టు చెప్తున్నారు. హిందీ మాట్లాడేవారి జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ స్థానాలను గెలుచుకొనే అవకాశం ఉన్న బీజేపీ వంటి పార్టీలకు ఇది అనుకూలంగా మారనున్నది.



**ప్రాతినిధ్యానికి ప్రమాదం**


1971 జనాభా లెక్కల తర్వాత కేంద్రం జనాభా నియంత్రణ చేపట్టింది. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించగా, ఉత్తరాదిలో జనాభా విస్ఫోటనం సంభవించింది. దీంతో ఉత్తరాదిలోనూ జనాభా నియంత్రణకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే, డీలిమిటేషన్ చట్టం-2002 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనను 2026 దాకా నిలిపేశారు. కానీ ఉత్తరాదిన జనాభా నియంత్రణ లక్ష్యం నెరవేరలేదు. ఇదే సమయంలో గడువు కూడా దగ్గరికి వస్తున్నది. దీంతో 2026లో జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాలను సవరించాలని యోచిస్తున్నారు. ఇదే జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో తమ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది.


**బీహార్ అలా.. తెలంగాణ ఇలా..**

తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 4 కోట్లు. జనాభాను లోక్‌సభ సీట్లతో గణిస్తే 23 లక్షల మంది జనాభాకు ఒక ఎంపీ ఉన్నట్టు లెక్క. అదే బీహార్‌ను పరిశీలిస్తే ఆ రాష్ట్ర జనాభా 12.6 కోట్లు. లోక్‌సభ సీట్లు 40. అంటే, 32 లక్షల మంది జనాభాకు ఒక ఎంపీ ఉన్నట్టు అర్థమవుతున్నది. ప్రతి 15 లక్షల మంది ఓటర్లకు ఒక ఎంపీ సీటును కేటాయించారని అనుకొంటే.. ఈ లెక్కన బీహార్‌లోని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎంపీ స్థానాలను సవరిస్తే ఆ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు రెట్టింపవుతాయి. అంటే జనాభా నియంత్రణను సరిగ్గా అమలు చేయని బీహార్‌కి రాజకీయంగా ఎంతో లబ్ధి చేకూరుతుంది. జనాభా నియంత్రణను పాటించిన తెలంగాణ వంటి రాష్ట్రాలకు పార్లమెంట్‌లో బీహార్‌తో పోలిస్తే సీట్ల పెరుగుదల తక్కువగా ఉంటుంది.

**జీడీపీలో వాటా ఎంత ఉన్నప్పటికీ...**

దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా 33%. మిగతా 24 రాష్ట్రాలది 67 శాతం. దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ తర్వాత 165 లోక్‌సభ సీట్లను (20 శాతం), మిగతా రాష్ట్రాలకు 683 స్థానాలను (80 శాతం) కట్టబెట్టాలను కొంటున్నారు. ఇప్పటికే భాష, సంస్కృతి, నిధుల పంపకం, రాజకీయ ప్రాధాన్యాల విషయాల్లో ఉత్తరాదితో పోలిస్తే వివక్షకు గురవుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఢిల్లీ గద్దెనెక్కాల్సిందెవరో నిర్ణయించే అంశంలోనూ తగిన ప్రాధాన్యం దక్కని పరిస్థితి నెలకొంది. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కార్యకర్తలు దీనిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**ఏడాదిలో లోక్‌సభలో మారనున్న సీట్ల లెక్కలు ఇలా (మొత్తం సీట్లు 848కి పెంచితే..)**

| ప్రాంతం | 2025లో సీట్లు | 2026లో సీట్లు (అంచనా) | పెరుగుదల |
|---|---|---|---|
| యూపీ+బీహార్ | 120 | 222 | 85 శాతం |
| హిందీ బెల్ట్ రాష్ట్రాలు | 294 | 461 | 57 శాతం |
| దక్షిణాది రాష్ట్రాలు | 129 | 165 | 28 శాతం |

**జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే.. (2026లో)**

| రాష్ట్రం | ప్రస్తుతం సీట్లు | మారనున్న సీట్లు | పెరుగుదల/తగ్గుదల |
|---|---|---|---|
| ఉత్తరప్రదేశ్ | 80 | 91 | +11 |
| బీహార్ | 40 | 50 | +10 |
| రాజస్థాన్ | 25 | 31 | +6 |
| మధ్యప్రదేశ్ | 29 | 33 | +4 |
| పంజాబ్ | 13 | 12 | -1 |
| హిమాచల్ ప్రదేశ్ | 4 | 3 | -1 |
| ఉత్తరాఖండ్ | 5 | 4 | -1 |
| కర్ణాటక | 28 | 26 | -2 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 21 | -4 |
| తెలంగాణ | 17 | 13 | -4 |
| తమిళనాడు | 39 | 31 | -8 |
| కేరళ | 20 | 12 | -8 |

## జనాభా నియంత్రణే శాపమా?

### స్టాలిన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాం: కేటీఆర్



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాలను పునర్విభజించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ అభిప్రాయంతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని బుధవారం ఒక ప్రకటనలో కేటీఆర్ తెలిపారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని ఆయన ప్రశ్నించారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. దేశ నిర్మాణంలో దక్షిణాది రాష్ట్రాలు అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని కేటీఆర్ పేర్కొన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉంటే అది 2022 నాటికి 19.8 శాతానికి పడిపోయిందని, అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తరాది రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ లెక్కన జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయని, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తరాది రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయని, అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమని ఆయన తెలిపారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ దేశ జీడీపీకి 5.2 శాతం వాటా అందిస్తోందని, దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయని, ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేటీఆర్ కోరారు.

### దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవు: అమిత్ షా

కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది ప్రాంత రాజకీయ ప్రాతినిధ్యంపై ఎలాంటి ప్రభావం చూపదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పుకొచ్చారు. కోయంబత్తూరులో బుధవారం జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2026లో చేపట్టబోయే ఈ ప్రక్రియ ద్వారా దక్షిణాదికి అదనపు నియోజకవర్గాలు కూడా వస్తాయని చెప్పారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 5న అఖిల పక్ష సమావేశ ం ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

---

## బస్సులో యువతిపై లైంగిక దాడి

**పుణెలో పోలీస్ స్టేషన్ దగ్గరే దారుణం**

ముంబై, ఫిబ్రవరి 26( నమస్తే తెలంగాణ) : రద్దీగా ఉండే పుణెలోని స్వార్గేట్ బస్టాండ్‌లో నిలబడి ఉన్న శివషాహి బస్సులో ఓ 26 ఏండ్ల యువతిపై లైంగిక దాడి జరిగింది. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. స్వార్గేట్ బస్టాండ్ పుణె నగరంలోని సురక్షితమైన బస్టాండ్‌లలో ఒకటిగా పేరు పొందింది. దానికి సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం... బాధితురాలు పుణె నుంచి ఫల్టన్‌లోని తన ఇంటికి వెళ్ళడానికి మంగళవారంస్వార్గేట్ బస్టాండ్‌కు వచ్చింది. అప్పుడు ఒక అపరిచితుడు ఆమె బస్సు మరొక ప్రదేశంలో ఆగిందని మాయమాటలతో నమ్మించి ఆమెను సమీపంలో ఆగి ఉన్న శివషాహి బస్సు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడి పారిపోయాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని దత్తాత్రయ రాందాస్ గాడేగా పోలీసులు గుర్తించారు. అతనిపై శిక్రాపూర్, షిరూర్ పోలీస్ స్టేషన్లలో అనేక కేసులు నమోదై ఉన్నాయి. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు.




## నీట్-పీజీ కనీస అర్హత మార్కులు తగ్గింపు

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ - పోస్ట్‌గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) కనీస అర్హతను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) మరోసారి తగ్గించింది. కనీసం 5 శాతం మార్కులు సాధించినవారు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చునని తెలిపింది. ఇది అన్ని క్యాటగిరీల అభ్యర్థులకు వర్తిస్తుందని చెప్పింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) తన వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. 2024 ఆగస్టు 23న ప్రచురించిన నీట్-పీజీ, 2024 ర్యాంక్, పర్సంటైల్ స్కోర్‌లో ఎటువంటి మార్పులు ఉండవని వివరించింది.

# సంపన్న వలసదారులకు గోల్డ్ కార్డులు

- 44 కోట్లతో అమెరికా పౌరసత్వం పొందొచ్చు
- కోటి కార్డులు అమ్మనున్నట్టు ట్రంప్ ప్రకటన
- ఈబీ -5 ప్రోగ్రామ్ స్థానంలో కొత్త పథకం

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అమెరికా పౌరసత్వాన్ని పొందాలని ఆశిస్తున్న సంపన్న విదేశీ వలసదారుల కోసం ఓ కొత్త పథకాన్ని తీసుకురానున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గోల్డ్ కార్డులను కొనుగోలు చేయడం ద్వారా అమెరికా పౌరసత్వాన్ని సులభంగా పొందే అవకాశాన్ని కల్పించాలని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. 5 మిలియన్ డాలర్లకు(సుమారు రూ.44 కోట్లు) గోల్డ్ కార్డులను విక్రయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ గోల్డ్ కార్డులు గ్రీన్ కార్డు నివాసంతో సమానమని, విదేశీయులు అమెరికన్ పౌరసత్వాన్ని పొందడానికి ఇది మార్గమని ట్రంప్ ప్రకటించారు. సుమారు 1 కోటి గోల్డ్ కార్డులను విక్రయిస్తామని ఆయన తెలిపారు. ఈ పథకం వల్ల దేశం ఎదుర్కొంటున్న రుణ భారం తొలగిపోతుందని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఈబీ-5 ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డులు వస్తాయని ఆయన వివరించారు. ఈబీ-5 వీసా కార్యక్రమం ద్వారా విదేశీ పెట్టుబడిదారులు తమ డబ్బును అమెరికాలో పెట్టుబడి పట్టడం ద్వారా ఉద్యోగాలు పొందడంతోపాటు ఉద్యోగలను సృష్టించవచ్చు. అంతేగాక శాశ్వత నివాస హోదాను కూడా పొందవచ్చు. అమెరికన్ వ్యాపారాలలో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చే విదేశీ సంపన్నులకు ఈబీ-5 ప్రోగ్రామ్ కింద గ్రీన్ కార్డులను ప్రసాదిస్తారు. కాగా, ఈ ప్రోగ్రామ్‌ను రద్దు చేసి గోల్డ్ కార్డుల విక్రయాన్ని ప్రారంభించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. గోల్డ్ కార్డులకు 5 మిలియన్ డాలర్ల చొప్పున వెల కడుతున్నామని ఆయన చెప్పారు. ఇది గ్రీన్ కార్డు అధికారాలు కల్పించడంతోపాటు అమెరికా పౌరసత్వాన్ని పొందేందుకు దారి కాగలదని ఆయన తెలిపారు. మరో రెండు వారాలలో ఈ పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ట్రంప్ తెలిపారు.




ఈబీ-5 ప్రోగ్రామ్ పనికి మాలింది: లుట్నిక్
అమెరికన్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ తీసుకువచ్చిన ఈబీ-5 ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్‌ను అమెరికన్ కాంగ్రెస్ 1990లో ఆమోదించింది. విదేశీ పెట్టుబడిదారుల ద్వారా ఉపాధి కల్పన, మూలధన పెట్టుబడులు రాబట్టి అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చింది. అయితే ఈ కార్యక్రమాన్ని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మంగళవారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా దుయ్యబట్టారు.

### సామాన్య భారతీయుల ఆశలపై నీళ్లు

సంపన్న విదేశీ పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా గోల్డ్ కార్డ్ ప్రకటన గ్రీన్ కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఆశగా నిరీక్షిస్తున్న భారతీయ ప్రొఫెషనల్స్‌ను మరింత నిరాశకు గురిచేసే అవకాశం కనపడుతోంది. అమెరికా రెసిడెన్సీ పొందేందుకు నేరుగా దారి చూపించే ఈ కొత్త పథకం భారతీయ కుబేరులు, వ్యాపార దిగ్గజాలకు మాత్రమే ఉపయోగపడే అవకాశం ఉంది. సుదీర్ఘ కాలంగా, కొన్ని సందర్భాలలో అనేక దశాబ్దాలుగా గ్రీన్ కార్డు కోసం వెయిటింగ్ లిస్టులో ఉన్న స్కిల్డ్ ప్రొఫెషనల్స్ కష్టాలు ఈ కొత్త పథకం వల్ల మరింత పెరిగే అవకాశం ఉంది. ఈబీ-5 కింద దరఖాస్తుదారులు రుణాలు తీసుకోవడం లేదా నిధులు సమీకరించుకోవడానికి అవకాశం ఉండగా గోల్డ్ కార్డులను నగదు చెల్లింపు ద్వారా మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సామాన్య, మధ్య తరగతి భారతీయులకు ఈ పథకం అందుబాటులో ఉండే అవకాశం ఏమాత్రం లేదు.

## ఆహార వ్యర్థాలతో దృఢమైన కాంక్రీట్

- నిర్మాణ బలం రెట్టింపు, కర్బన ఉద్గారాల తగ్గుదల
- ఇండోర్ ఐఐటీ పరిశోధకుల వినూత్న ఆవిష్కరణ




ఇండోర్, ఫిబ్రవరి 26: ఆహార వ్యర్థాలు వృథా కాకుండా వినియోగించుకునేందుకు ఇండోర్ ఐఐటీ పరిశోధకులు ఓ ప్రత్యేక మార్గాన్ని కనుగొన్నారు. ఆ వ్యర్థాలను 'ఈ-కొలి' లాంటి నాన్-పాథోజెనిక్ (వ్యాధులను సంక్రమింపజేయని) బ్యాక్టీరియాతో కలిపి కాంక్రీట్‌లో మిళితం చేయడం ద్వారా దృఢమైన నిర్మాణ పదార్థాన్ని తయారు చేశారు. నిర్మాణ బలాన్ని రెట్టింపు చేయడంతో పాటు కర్బన ఉద్గారాలను తక్కువగా విడుదల చేయడం ఈ కాంక్రీట్ ప్రత్యేకత. ఆహార వ్యర్థాలు కుళ్లిపోతే కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతుంది. ఆ వ్యర్థాలతోపాటు బ్యాక్టీరియాను కాంక్రీట్‌లో కలిపితే అందులో ఉండే కాల్షియం అయాన్లతో కార్బన్ డయాక్సైడ్ చర్య జరిపి కాల్షియం కార్బొనేట్ స్ఫటికాలను ఏర్పరుస్తుందని ఇండోర్ ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ సందీప్ చౌదరి వెల్లడించారు. ఈ స్ఫటికాలు కాంక్రీట్‌లోని రంధ్రాలు, పగుళ్లను పూడ్చేస్తాయని, తద్వారా ఆ కాంక్రీట్ బరువుపై పెద్దగా ప్రభావమేమీ చూపదని, పైగా దాని దృఢత్వాన్ని బాగా పెంచుతాయని ఆయన వివరించారు.

## భూ వినియోగాన్ని ఆపడానికి వీల్లేదు

చట్టాన్ని ప్రభుత్వం, అధికారులు అనుసరించాలి

**భూమి యజమాని హక్కులపై సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ : భూమిని దాని యజమాని వినియోగించుకోకుండా నిరవధికంగా ఆపకూడదని సుప్రీంకోర్టు చెప్పింది. భూమిని ఫలానా విధంగా వినియోగించరాదని నిషేధాజ్ఞను జారీ చేసినపుడు, ఆ నిషేధాజ్ఞను అనంత కాలంపాటు అమలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. 33 ఏండ్ల నుంచి స్థలాన్ని డెవలప్‌మెంట్ ప్లాన్‌లో రిజర్వు చేసి ఉంచడంలో అర్థం లేదని చెప్పింది. ఇటీవల ఓ కేసు విచారణ సందర్భంగా మహారాష్ట్ర ప్రాంతీయ, పట్టణ ప్రణాళిక చట్టంలోని సెక్షన్ 127ను ప్రస్తావించింది. ఈ భూమిని అసలు యజమానులనే కాకుండా, దాని కొనుగోలుదారులను కూడా అధికారులు అనుమతించడం లేదని వ్యాఖ్యానించింది.

## ఆరేండ్లు పోటీకి అనర్హులను చేస్తే చాలు


- దోషిగా తేలితే జీవితకాల నిషేధం తగదు
- అది పార్లమెంట్ పరిధిలోని అంశం
- రాజకీయ నేతల క్రిమినల్ కేసులపై కేంద్రం




న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నేతలు రాజకీయ పదవులను చేపట్టకుండా జీవిత కాలం నిషేధించడం కఠిన చర్య అవుతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత విధానం ప్రకారం ఇటువంటివారిని ఆరు సంవత్సరాలపాటు అనర్హులను చేయడం సరిపోతుందని చెప్పింది. ఎంత కాలం అనర్హులుగా ప్రకటించాలనేది పూర్తిగా పార్లమెంట్ పరిధిలోని అంశమని తెలిపింది. దామాషా, సమంజసత్వ సిద్ధాంతాలను పరిగణనలోకి తీసుకుని, దోషిని ఎంత కాలం అనర్హుడిగా ప్రకటించాలి? అనే దానిని సభ నిర్ణయిస్తుందని వివరించింది. అడ్వకేట్ అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన కేంద్రం ఈ మేరకు అఫిడవిట్‌ను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను వేగంగా పరిష్కరించాలని, దోషులుగా నిర్ధరణ అయిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలని పిటిషనర్ కోరారు. పిటిషనర్ లేవనెత్తిన అంశాలు విస్తృత స్థాయి పర్యవసానాలు కలిగినవని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇవి పార్లమెంటు శాసన విధానం పరిధిలోనివని చెప్పింది. అనర్హత వేటు వేయడానికి తగిన కారణాలను, దాని కాల వ్యవధిని నిర్ణయించడానికి పార్లమెంటుకు రాజ్యాంగం అధికారం కల్పించిందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రేషన్ గోధుమల వల్ల బట్ట తల

**మహారాష్ట్రలో వింత వ్యాధిపై నివేదిక**



ముంబై, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని బుల్ధానాలో నిరుడు డిసెంబర్‌లో ఓ వింత వ్యాధి వ్యాపించి అకస్మాత్తుగా ప్రజల్లో జుట్టు రాలడం మొదలై పిల్లలు, పెద్దలు స్త్రీలలో చూస్తుండగానే బట్టతల ఏర్పడింది. రెండు నెలల్లోనే 18 గ్రామాల్లో 279 మందికి జుట్టు ఊడిపోయింది. ఈ కేసుకు సంబంధించిన వైద్య నివేదిక మంగళవారం వెలువడింది. ప్రాథమిక నివేదికల ప్రకారం, పంజాబ్, హర్యానాల నుంచి వచ్చిన గోధుమలే ప్రజల జుట్టు రాలడానికి కారణమని తెలిసింది. ఈ గోధుమలలో సెలీనియం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడి ప్రజలు వాడిన గోధుమలు పంజాబ్, హర్యానా నుంచి వచ్చాయని, ఇవి మహారాష్ట్రలోని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ అయ్యాయని తేలింది. మహారాష్ట్రలో స్థానికంగా పండించిన గోధుమల కంటే పంజాబ్,హర్యానా గోధుమలలో 600 రెట్లు ఎక్కువ సెలీనియం ఉందని పరిశోధనలో తేలిందని నివేదిక పేర్కొంది.



*మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇటీవల ప్రధాని మోదీ ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భోజనాల వద్ద అతిథులు ప్లేట్ల కోసం ఒకరినొకరు తోసుకోవడం, దూషించుకోవడం అందరినీ విస్తుపోయేలా చేసింది. నిర్వాహకులు అరకొర ఏర్పాట్లు చేయడంతో అతిథులు కొట్లాటలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత అధ్వాన్నంగా ఏర్పాట్లు చేయడం పట్ల అధికార బీజేపీపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.*

## బెంగళూరులో అడుగంటిన భూగర్భ జలాలు

**కొత్త బోర్లకు అనుమతుల నిరాకరణ**

బెంగళూరు : కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని నగరం బెంగళూరులో భూగర్భ జలాలు వేగంగా క్షీణిస్తున్నాయి. దీంతో కొత్త బోరు బావుల తవ్వకానికి అనుమతులివ్వడాన్ని అధికారికంగా నిలిపేశారు. బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి వారం రోజుల నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరించడం మానేసింది. ఈ ఏడాదంతా భూగర్భ జలాల స్థాయులను పరిశీలిస్తామని చెప్పింది. మండుటెండలు కమ్ముకొస్తున్న తరుణంలో ఈ పరిస్థితి పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాల ఊట సామర్థ్యం పరిమితంగా ఉన్నప్పటికీ, వాటిని అత్యధికంగా తోడేస్తున్నారు. భూగర్భ జలాల స్థాయులు దారుణంగా పడిపోయినట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) తెలిపింది. దీంతో బోర్డు ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఇదిలావుండగా, తాగునీటిని దుర్వినియోగం చేసేవారిపై బోర్డు కొరడా ఝుళిపిస్తున్నది.

## నెయ్యిలో రసాయనాలు కలిపాం

**తిరుమల లడ్డూ కల్తీ కేసులో నిందితుడి వెల్లడి**

తిరుపతి, ఫిబ్రవరి 26: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడినట్టు వచ్చిన ఆరోపణల కేసు దర్యాప్తులో తాజాగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రసాదం తయారీ కోసం సరఫరా చేసిన నెయ్యిలో రసాయనాలు కలిపినట్టు నిందితులలో ఒకరైన కెమికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అపూర్వ చావ్డా సిట్ దర్యాప్తులో వెల్లడించినట్టు తెలిసింది. నిందితులు అపూర్వ చావ్డా, విపిన్ జైన్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సిట్ న్యాయవాది అదనపు మున్సిఫ్ కోర్టులో కస్టడీ పిటిషన్లు దాఖలు చేశారు. ఇదిలా ఉండగా, భోలేబాబా ఆర్గానిక్ డైరీ మాజీ డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్ బెయిల్ పిటిషన్లను ఉపసంహరించుకున్నట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి జయశేఖర్ ధ్రువీకరించారు. నిందితుడు అపూర్వ చావ్డా బెయిల్, కస్టడీ పిటిషన్‌పై కోర్టు గురువారం విచారణ జరపనున్నది.